

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 188 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు ఆదివారం, నవంబరు 08, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



ఈ20 కాదు..420: పెట్రోల్‌లో అధిక ఇథనాల్‌పై...

రాహుల్ ఆగ్రహం..!!

- ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగలించడమే..
- నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నాయి..
- వీటిల్లో ఇథనాల్ గాఢతలు 31.2శాతం- 30.5శాతంగా నమోదయ్యాయి
- 20శాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు
- ఇటువంటి విధానాల వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత నిలదీత

కర్ణాటకలోని పలు పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్‌లో 20శాతం కంటే ఎక్కువగా ఇథనాల్ ఉన్నట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ20 (జూ20) కార్యక్రమం కాస్తా 420గా మారిందంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగలించడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ చమురు కంపెనీలు.. నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు కర్ణాటకలోని పలు జిల్లాల నుంచి సేకరించిన ఇంధన నమూనాల ప్రయోగశాల పరీక్షలను ఆయన ఉటంకించారు. బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణం,

దేశ ప్రజలకు ప్రధాని మోదీ

దీపావళి శుభాకాంక్షలు



దీపావళి సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాలు సుఖ సంతోషాలతో వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని చెప్పారు. ఈ మేరకు ప్రధాని ఎక్స్‌లో ఈరోజు (శనివారం) వీడియో పోస్ట్ చేశారు. 'పవిత్రమైన



'లైబ్రరీ' వివాదంలో

విజయ్..!

- లైబ్రరీకి పుస్తకాల కొనుగోళ్లలో అవకతవకలు
- జరిగాయంటూ తీవ్ర ఆరోపణలు
- ద్రవిడ రాజకీయాల రూపకర్త పెరియార్ జ్ఞాపకార్థం
- 'పెరియార్ అరివులగం' అని పేరు పెట్టారు
- ఇందులో లక్షకు పైగా పుస్తకాలతో పాటు ఒక
- డిజిటల్ లైబ్రరీ సదుపాయం కూడా ఉంది
- రచయిత పెరుమాళ్ మురుగన్ వెల్లడించిన
- విషయాలు సంచలనం సృష్టిస్తున్నాయి

తమిళనాడులో సీఎం విజయ్ ప్రభుత్వం మరోకొత్త వివాదంలో చిక్కుకుంది. గత నెల భారీ హంగులతో ప్రారంభించిన "పెరియార్ అరివులగం' లైబ్రరీకి పుస్తకాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయంటూ తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో స్వతంత్ర దర్యాప్తు చేయాలని అన్నామలై సహా పలువురు రాజకీయ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే..? తమిళనాడులో కోయంబత్తూర్‌లో ఏడు ఎకరాల్లో రూ.300 కోట్లతో

..2వ పేజీలో

ఏపీ పెట్టుబడులకు గ్లోబల్ వేదిక..


విశాఖ సీఐఐ సమ్మిట్‌పై...

సీఎం చంద్రబాబు ఫోకస్..!!

- అనేక రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విశ్వవ్యాప్తం చేయాలి
- చర్చలను వ్యాపార, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా తీసుకువెళ్లాలి
- ప్రపంచ మార్కెట్లతో రాష్ట్ర పరిశ్రమలను అనుసంధానించడం, ఎంఎస్ఎంఈలకు
- కొత్త వ్యాపార పరిచయాలు కల్పించడం ప్రధాన లక్ష్యం కావాలి
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం పెంచేలా సదస్సు నిర్వహించాలని సీఎం వెల్లడి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలు ప్రపంచ వ్యాప్తం కావాలి
- టెక్నాలజీ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రచారం చేయాలి
- బలమైన నాయకత్వం వంటి అనుకూలతలు ఉన్న రాష్ట్రం ఏపీ..
- ఏపీలో పెట్టుబడి సురక్షితం, సులభతరం అనే విషయం పారిశ్రామికవేత్తలకు తెలియాలి
- ఈ సదస్సుకు 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తల భాగస్వామ్యం ఉండనుంది
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విశాఖ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో అనేక రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విశ్వవ్యాప్తం చేయాలన్నారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానిస్తూ... చర్చలను వ్యాపార, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రపంచ మార్కెట్లతో రాష్ట్ర పరిశ్రమలను అనుసంధానించడం, ఎంఎస్ఎంఈలకు కొత్త వ్యాపార పరిచయాలు కల్పించడం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. సాంకేతిక సహకారాన్ని విస్తరించడం, యువత నైపుణ్యాలకు అంతర్జాతీయ అవకాశాలను పరిచయం చేయడం వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం పెంచేలా సదస్సు నిర్వహించాలని సీఎం వెల్లడించారు. ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక రాయితీల చెల్లింపు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలు ప్రపంచ వ్యాప్తం కావాలన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అత్యుత్తమ పాలసీలు, సమర్థులైన నిపుణులు, మౌలిక సదుపాయాలు, నాలెడ్జ్, బలమైన నాయకత్వం వంటి అనుకూలతలు ఉన్న రాష్ట్రం

..2వ పేజీలో



విశాఖటలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌లో చర్చించే అంశాలు, డిక్లరేషన్లపై సీఐఐ ప్రతినిధులు, అధికారులతో సీఎం రివ్యూ చేపట్టారు.

చర్చించే అంశాలివే..

- వాణిజ్యం - పెట్టుబడులు - గ్లోబల్ వాల్యూ చైన్స్
- ట్రస్ట్ - జియో ఎకనమిక్స్ - గ్లోబల్ కో ఆపరేషన్
- వ్యవసాయం - ఆహార భద్రత - జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ
- ప్రతిభ - నైపుణ్యాలు - అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు
- సాంకేతికత - ఆవిష్కరణలు - భవిష్యత్ పరిశ్రమలు
- స్వచ్ఛ ఇంధనం- సుస్థిర వృద్ధి అనే ఆరు ప్రధాన అంశాలపై చర్చలు జరగనున్నాయి.

జగన్ సొంత ఇలాకాలో...

వైసీపీకి షాక..!!

పులివెందుల, మైదుకూరు జడ్పీటీసీలు టీడీపీ కైవసం

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో వైసీపీ ఖాతా తెరవలేకపోయింది

- పులివెందుల, మైదుకూరు జడ్పీటీసీలను టీడీపీ కైవసం చేసుకుంది
- పులివెందులలో 1,463 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి భారతి విజయం
- మైదుకూరులో 18,903 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి కృష్ణకిషోర్ గెలుపు
- పులివెందులలో మొత్తం 65 ఎంపీటీసీ స్థానాల్లో 64 స్థానాలను కూటమి కైవసం
- వేంపల్లి మండలం రెడ్డిపల్లి ఎంపీటీసీకి మాత్రమే ఎన్నిక జరిగింది
- ఎంపీటీసీ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు...

కడప : కడప జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఏకంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత ఇలాకాలో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. పులివెందుల, మైదుకూరు జడ్పీటీసీలను టీడీపీ కైవసం చేసుకుంది. పులివెందులలో 1,463 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి భారతి విజయం సాధించగా.. మైదుకూరులో 18,903 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి కృష్ణకిషోర్ గెలుపొందారు. పులివెందుల నియోజకవర్గంలో మొత్తం 65 ఎంపీటీసీ స్థానాల్లో 64 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. వేంపల్లి మండలం రెడ్డిపల్లి ఎంపీటీసీకి మాత్రమే ఎన్నిక జరిగింది. అలిరెడ్డిపల్లిలో కూడా 29 ఓట్ల మెజారిటీతో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి 1166 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శాంతిపురం మండలం సి.బండపల్లి టీడీపీ అభ్యర్థి 718 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. మొరసనపల్లి టీడీపీ అభ్యర్థి 494 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.



టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అటు.. బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలం జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ఓబులమ్మ ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థిపై 8391 ఓట్ల భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు.

కుప్పం నియోజకవర్గంలో బోణీ కొట్టని వైసీపీ...

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో వైసీపీ ఖాతా తెరవలేకపోయింది. ఎంపీటీసీ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. రామకుప్పం మండలం మనేంద్రం ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి 712 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కుప్పం మండలం నడుమూరు





ఏపీలో పరిషత్ ఫలితాల్లో

కూటమి హవా..

ఏపీ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలోని ఆయా జిల్లాలో కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారు. దీంతో తెదేపా, జనసేన, భాజపా పార్టీ శ్రేణులు గెలుపు సంబరాలను నిర్వహించుకుంటున్నారు.



ఈ20 కాదు..420: పెట్రోల్‌లో అధిక ఇథనాల్‌పై రాహుల్ ఆగ్రహం..!!

(మొదటిపేజీ తరువాయి) రామనగర, మంగళూరు, తుమకూరుతో సహా పలు ప్రాంతాల నుంచి ఈ నమూనాల ను సేకరించినట్లు రాహుల్ వెల్లడించారు. వీటిల్లో ఇథనాల్ గాఢతలు 31.2శాతం- 30.5శాతంగా నమోదయ్యాయని తెలిపారు. గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించిన మొత్తం 14 నమూనాలలోని 11నమూనాల్లో 20శాతానికి పైగా ఇథనాల్ ఉన్నట్లు తేలిందని చెప్పారు. ఇంధన ట్యాంకులలో ఏమి నింపుతున్నారనే విషయాన్ని ఇప్పటికైనా తెలియజేయాలని ప్రధాని మోదీని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 20శాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఇటువంటి విధానాల వల్ల ఎవరు ప్రయోజనం



పొందుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత నిలదీశారు. కర్ణాటకలో ఈ-20 పేరిట 30శాతం ఇథనాల్ కలిసిన ఇంధనాన్ని విక్రయిస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ శుక్రవారం ఆరోపించారు. దీంతో ఈ విషయంపై రాజకీయ దుమారం రేగింది. అయితే పెట్రోల్‌లో ఇథనాల్ పరిమాణం ఎక్కువగా ఉందని కర్ణాటక ప్రభుత్వం వాదించడాన్ని కేంద్ర పెట్రోలియం సంస్థలు- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా తోసిపుచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పరీక్ష ప్రామాణికత సరికాదని తేల్చిచెప్పాయి. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సంస్థ నిబంధనల మేరకు ఇథనాల్ 19- 21శాతం మధ్య ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించాయి.

ఏపీ పెట్టుబడులకు గ్లోబల్ వేదిక..
విశాఖ సీఐఐ సమ్మిట్‌పై...
సీఎం చంద్రబాబు ఫోకస్..!!

(మొదటిపేజీ తరువాయి) ఏపీ అని చెప్పుకొచ్చారు. ఏపీలో పెట్టుబడి సురక్షితం, సులభతరం అనే విషయం పారిశ్రామికవేత్తలకు తెలియాలన్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ అధికారులు, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, ఇతర సీఐఐ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి విశాఖ సదస్సు తీసుకురానుంది. ఈ సదస్సుకు 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తల భాగస్వామ్యం ఉండనుంది. అలాగే 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. మొత్తంగా సుమారు 1,250 మంది దేశ, విదేశీ ప్రతినిధుల భాగస్వామ్యంతో సదస్సు జరగనుంది. వ్యాపార సంస్థల మధ్య భాగస్వామ్యాలను పెంపొందించేందుకు 400 బిజినెస్ టు బిజినెస్ (బీ టు బీ) సమావేశాలు జరగనున్నాయి. ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపులకు బిజినెస్ టు గవర్నమెంట్ (బీ టు జీ) సమావేశాలు నిర్వహించనున్నారు. సింగపూర్ నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా వంటి పలు దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న సదస్సుకు వివిధ దేశాల రాయబారులు, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమానికి చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. రెండు రోజుల సదస్సులో 6 అంశాలపై ప్రధాన చర్చలు జరగనున్నాయి.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ...
దీపావళి శుభాకాంక్షలు

(మొదటిపేజీ తరువాయి) దీపావళి పండుగ మీకు ప్రశాంతతను, విజయాలను, సుఖసంతోషాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా కొన్ని సంవత్సరాల నుంచీ మోదీ దీపావళిని సైనికులతో కలిపి జరుపుకొంటున్నారు. ఈ ఏడాది కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని ఆయన వీడియోలో వెల్లడించారు.

ఎమర్జెన్సీ నిర్ణయం పొరపాటే - సోనియా

దేశంలో అత్యయిక స్థితి విధించిన ఘటనకు సంబంధించి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ విధించాలనే నిర్ణయం ఓ పొరపాటు అని అన్నారు. తన అత్తగారు, నాటి ప్రధాని ఇందిరా గాంధీ కూడా ఇదే భావించి ఉండవచ్చని అనుకుంటున్నట్లు చెప్పారు. తన ఆత్మకథ పుస్తక రూపంలో త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఓ బ్రిటిష్ దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె (ాశీఅఱు ుఅఎష్ట్రఅ) ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన నష్టంలో చాలావరకు నివారించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ఎమర్జెన్సీ విధించడం పొరపాటే. ఇందిర కూడా అదేవిధంగా భావించారు. ఎమర్జెన్సీ నిర్ణయంపై కుటుంబంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనిని రాజీవ్ గాంధీ కూడా వ్యతిరేకించారు. వచ్చే ఎన్నికల వరకు వేచి ఉండాలని తన తల్లికి చెప్పినప్పటికీ.. ఆమె చిన్న కుమారుడు సంజయ్ మాత్రం పట్టుబట్టారు. ప్రతిపక్షం తన తల్లిని నాశనం చేస్తుందని, వారిని కట్టడి చేయాలని ఓ రోజు ఫ్యామిలీ డిన్నర్‌లో వాదించారు. రాజీవ్ తన తల్లిని నిలదీయడానికి ప్రయత్నించగా.. ఆమె వినడానికి నిరాకరించారు. ఈ విషయం కుటుంబంలో కూడా ఉద్రిక్తతలను పెంచింది. సంజయ్‌ను అదుపులో పెట్టి ఉంటే.. ఆ తర్వాత జరిగిన నష్టంలో చాలావరకు నివారించి ఉండేవారు. వాస్తవానికి ఇందిరా ఓ ప్రజాస్వామ్యవాది అని భావిస్తా. ఇలా చెప్తే చాలా మంది నవ్వుతారని తెలుసు. కానీ, నాటి ఎమర్జెన్సీ సమయంలో ఆమె ఏమాత్రం సౌకర్యంగా లేరని చెప్పగలను. ఆ భారం ఆమెపై చాలా ఎక్కువగా ఉండేదని అనుకుంటున్నా" అని సోనియా గాంధీ పేర్కొన్నారు. ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ సోనియా గాంధీ ఈ తరహా వ్యాఖ్యలే చేశారు. కేవలం సంజయ్ నుంచే కాకుండా సీనియర్ల నుంచి ఇందిరా గాంధీపై ఒత్తిడి ఉండేదన్నారు. ఆమె చుట్టూ ఉండే వాళ్లలో రాజీవ్ మాదిరిగా భిన్నంగా ఆలోచించేవారు తక్కువగా ఉండేవారని చెప్పారు. క్రమంగా ఆమె స్వయంగా పరిస్థితిని అర్థం చేసుకొని వాటిని చక్కదిద్దినట్లు వివరించారు. ఎమర్జెన్సీ విధించిన తర్వాతే అసలేం జరుగుతుందో తనకు అర్థమైందని.. ప్రజాస్వామ్య హక్కులు కట్టడి చేయడం, హెబియస్ కార్పస్ నిలిపివేయడం వంటివి జరిగాయన్నారు. కానీ, అది రాజ్యాంగబద్ధంగానే జరిగిందని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

జగన్ మేనత్త గ్రామంలో తెదేపా విజయం..

పరిషత్ పోరులో ఆసక్తికర ఘటనలు
ఎంపీటీసీలుగా తండ్రి యుగంధర్, కుమార్తె కావ్య

అమరావతి: ఏపీలో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకున్నాయి.

జగన్ మేనత్త గ్రామంలో 20ఏళ్ల తర్వాత తెదేపా విజయం... ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో తెదేపా ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. 20 ఏళ్ల తర్వాత ఇక్కడ తెదేపా ఎంపీటీసీ అభ్యర్థి గెలుపొందడం విశేషం. గణపవరం జగన్ మేనత్త, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలమ్మ స్వగ్రామం.



ఒక ఓటు తేడాతో గెలిచిన తెదేపా అభ్యర్థి అరుణ... నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం తెదేపా అభ్యర్థి అరుణ రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో విజయం వరించింది.ఆరు ఓట్లు తేడా రావడంతో అధికారులు రీకౌంటింగ్ నిర్వహించారు. రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో అరుణ గెలుపొందినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో కౌంటింగ్ సెంటర్ వద్ద బైఠాయించి తనకు న్యాయం చేయాలని వైకాపా అభ్యర్థి ఆందోళనకు దిగారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చంద్రవరం ఎంపీటీసీగా తెదేపా అభ్యర్థి కాట్రూ శ్రీనివాసరావు కేవలం 3 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో తెదేపా తరఫున పోటీ చేసిన తండ్రి, కుమార్తె జి.యుగంధర్, కావ్య గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మల్లిపూడి తెదేపా అభ్యర్థి కొల్లి అరుణ కుమారి ఒక ఓటు తేడాతో గెలుపొందారు. దీంతో వైకాపా అభ్యర్థహ రికౌంటింగ్ కోరగా.. రీకౌంటింగ్‌లోనూ ఒక్క ఓటు మెజార్టీతో అరుణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ధ్రువీకరించారు.

తోడికోడళ్ల పోరు.. కూటమిదే విజయం... పశ్చిమ గోదావరి ఆచంట మండలం పెదమల్లం గ్రామంలో తోడికోడళ్ల మధ్య జరిగిన పరిషత్ పోరులో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. కూటమి నుంచి పోటీ చేసిన బోడపాటి మంగదేవి ప్రత్యర్థి తోడికోడలిపై 18 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఏపీ హోంమంత్రి అనితకు సొంత సెగ్మెంట్లో ఝలక్... అనకాపల్లి జిల్లా నక్కపల్లి 1, 2 ఎంపీటీసీ స్థానాల్లో వైకాపా అభ్యర్థులు తుమ్మ కల్పన, గొడుగుల బంగారాజు విజయం సాధించారు. నక్కపల్లి-2 ఎంపీటీసీ పరిధిలోనే హోంమంత్రి అనిత నివాసం ఉంది.

తండ్రి వైకాపా.. కుమార్తె తెదేపా.. ఇద్దరూ గెలిచారు... ఏపీలో పరిషత్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో తండ్రి కుమార్తె వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసి ఎంపీటీసీలుగా గెలుపొందారు. కొత్తపేట-2 స్థానంలో తెదేపా అభ్యర్థి చాందిని గెలుపొందారు. పలివెల-2 స్థానం నుంచి ఆమె తండ్రి, వైకాపా అభ్యర్థి పొనుగుపాటి సత్యనారాయణ విజయం సాధించారు.



బ్యాలెట్ బాక్స్‌లో కరపత్రాలు... పల్నాడు జిల్లా నరసరావుపేట ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సత్తెనపల్లి మండలం కంకాణలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లతో పాటు కరపత్రాలను కౌంటింగ్ సిబ్బంది గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ అకారం అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి వద్దంటూ అందులో విన్నవించారు. అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి యూ ఆకారంలో నిర్మిస్తే ఇబ్బంది పడతామని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రధాన రహదారికి బ్రిడ్జిని అనుసంధానం చేసేలా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. తిరుపతి రూరల్ జడ్పీటీసీ సభ్యుడిగా వైకాపా నుంచి చెవిరెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపును పరిశీలించేందుకు తనయుడి తరఫున కౌంటింగ్ కేంద్రానికి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన భార్య లక్ష్మి వచ్చారు. ఇదే స్థానంలో తెదేపా అభ్యర్థి ధనలక్ష్మి తరఫున కౌంటింగ్ కేంద్రానికి పులివర్తినాని, ఆయన భార్య సుధారెడ్డి వచ్చారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో 137 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రాగా.. వీటిలో 91 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల సిబ్బంది తేల్చారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం పోస్టల్ బ్యాలెట్‌లో మొత్తం 66 ఓట్లు నమోదు కాగా.. అందులో 64 చెల్లని ఓట్లు ఉండటం గమనార్హం. కేవలం రెండు ఓట్లను మాత్రమే లెక్కించగా.. ఆ రెండూ తెదేపా అభ్యర్థికే వచ్చాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం పోస్టల్ బ్యాలెట్‌లో తెదేపా, వైకాపాకు పోలైన ఓట్ల కంటే.. చెల్లని ఓట్ల సంఖ్యే అధికంగా ఉంది. ఇక్కడ మొత్తం 201 ఓట్లు పోల్ కాగా.. తెదేపా-50, వైకాపా- 54, స్వతంత్రులకు 11 ఓట్లు రాగా.. 85 ఓట్లను చెల్లనివిగా కౌంటింగ్ సిబ్బంది గుర్తించారు. కాకినాడ జిల్లాలో తెదేపా నుంచి ఎంపీటీసీలుగా దంపతులు విజయం సాధించారు. ప్రత్తిపాడు-2లో భర్త యాళ్ల జగదీశ్, ప్రత్తిపాడు-3లో భార్య మంగాదేవి గెలుపొందారు.

'లైబ్రరీ' వివాదంలో విజయ్..!

(మొదటిపేజీ తరువాయి) ఏడు అంతస్తుల్లో ఒక లైబ్రరీని నిర్మించారు. దాని నిర్మాణం డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా.. ఇటీవల పూర్తయింది. అక్టోబర్ 16న సీఎం విజయ్ ఘనంగా ప్రారంభించారు. ద్రవిడ రాజకీయాల రూపకర్త పెరియార్ జ్ఞాపకార్థం 'పెరియార్ అరివులగం' అని పేరు పెట్టారు. ఇందులో లక్షకు పైగా పుస్తకాలతో పాటు ఒక డిజిటల్ లైబ్రరీ సదుపాయం కూడా ఉంది. ఈ సందర్భంగా రచయిత పెరుమాళ్ మురుగన్ వెల్లడించిన విషయాలు సంచలనం సృష్టిస్తున్నాయి. అవి స్థానిక తమిళ మీడియాలో ప్రచురితమయ్యాయి. 1800 పుస్తకాలను అధికధరలకు కొనుగోలు చేశారని, రచయితలు, ప్రచురణకర్తల పేర్లు అనుమానాస్పదంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. కొన్ని పుస్తకాలను ఏఐ ఉపయోగించి రాసి ఉండొచ్చని, వాటిపై ముద్రించిన ఐఎస్‌బీఎన్ (International Standard Book Number- ఒక నిర్దిష్ట పుస్తక శీర్షికకు కేటాయించే నంబర్)లను తప్పుబట్టారు. ప్రచురణకర్తలను సంప్రదించేందుకు తగిన వివరాలు లేవన్నారు. ఎప్పుడూ వినని బాలు, జ్యోతి శరవణన్, జ్యోతి హరిహరన్, త్రిష విజయ్, రాణి పన్నీర్ వంటి రచయిత పేర్లు ఉండటంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

టీవీకే-డీఎంకే విమర్శలు.. ఎవరికీ తెలియని ప్రచురణకర్తల పేర్లు ఉన్నాయని, పుస్తకాలపై రూ.250-300 ఉండాల్సిన ధర రూ.1500 వరకు ఉందని వెల్లడించారు. 'తమిళనాడు ఒరు పార్వై' పుస్తకంలో తమిళనాడు తొలిసీఎం పేరు ముత్తువేలు సుబ్బయ్య అయ్యర్ అని ఉందని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. డీఎంకే సమయంలోనే కొనుగోళ్లు పూర్తయ్యాయని విజయ్ ప్రభుత్వం చెప్తుండగా.. కొత్త ప్రభుత్వమే కొనుగోళ్లు చేసిందని డీఎంకే (ణవీఖ) ఆరోపిస్తోంది. ఈ అవకతవకలన్నీ నిజమైతే.. భవిష్యత్ తరాలకు ద్రోహం చేయడమే అవుతుందని అన్నామలై ఆందోళన వ్యక్తంచేశారు. గత డీఎంకే హయాంలో ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసిన పుస్తకాల జాబితా ఏంటి..? ఆ పుస్తకాలనే కొనుగోలు చేశారా..? వాటికి సంబంధించిన వివరాలను ఎవరు ధ్రువీకరించారు. మొత్తంగా ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి" అని ఈ ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ వివాదంపై తమిళనాడు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

సంపాదకీయం

సూర్యఘర్ పథకానికి...
బ్యాంకుల షాక్..!!

బిల్లు తగ్గాలంటే సిబిల్ ఉండాలట..!

సోలార్ యూనిట్ల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే బ్యాంకులు రుణం ఇవ్వకపోవచ్చని, అయితే అర్హత ఉన్నప్పటికీ బ్యాంకు సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత ఫిర్యాదు చేయాలని రెడ్కో అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణానికి మేలు



చేస్తూ, సామాన్యుడికి కరెంట్ బిల్లుల భారం..

ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉక్కపోతతో ఇళ్లలో ఏసీలు, కూలర్లు ఫుల్ గా తిరుగు తున్నాయి. ఫలితంగా.. కరెంట్ మీటర్లు గిరగిరా తిరుగుతున్నాయి. దీంతో విద్యుత్ బిల్లులు సామాన్యుడి గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు కొండలా వచ్చిపడుతున్న బిల్లులను తప్పించుకోవడానికి జనం సోలార్ వైపు పరుగులు తీస్తున్నారు. కేంద్రం సబ్సిడీ ఇస్తామంటోంది. దీనికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కానీ బ్యాంకర్ల కోర్రీలతో సూర్యఘర్ పథకం లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం పెరిగి బిల్లులు భారంగా మారుతున్నాయి. మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వినియోగ దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ కష్టాల నుంచి బయటపడేందుకు సామాన్యులు సోలార్ విద్యుత్ పై ఆసక్తి చూపుతున్నారు. ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ - ముఫ్త్ బిజిలీ యోజన పథకం సామాన్యులకు వరంగా మారుతుందని భావించారు. ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఖర్చు తగ్గించుకోవడంతో పాటు ప్రభుత్వ రాయితీ కూడా పొందవచ్చన్న ఆశతో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ పథకం కింద ఒక కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం వరకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. కేంద్రం నిర్ణయించిన నిబంధనల ప్రకారం సామర్థ్యాన్ని బట్టి రాయితీ లభిస్తుంది. ముఖ్యంగా మూడు కిలోవాట్ల వరకు గరిష్ఠంగా రూ.78 వేల వరకు కేంద్ర సబ్సిడీ అందుతుంది. నిబంధనలకు అనుగుణంగా నెట్ మీటరింగ్ ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గృహ వినియోగదారులకు ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా లభిస్తుంది. మిగిలిన అదనపు విద్యుత్తును నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా చేసి డిస్కమ్ ద్వారా ఆదాయం కూడా పొందవచ్చు. అయితే అందుకు సంబంధించిన బిల్లింగ్, క్రెడిట్ విధానం స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

దేశంలోనే తెలంగాణ టాప్.. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 1,07,903 దరఖాస్తులు రాగా, అందులో 73,135 ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను విజయవంతంగా ఏర్పాటు చేసి దేశంలోనే తెలంగాణ ఉత్తమ ప్రగతిని కనబరుస్తోంది. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు 8500 వరకు దరఖాస్తులు వచ్చాయని సమాచారం. ఇందులో 5900 వరకు సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేశారు.

అసలు ట్విస్ట్ ఇక్కడే.. సూర్యుడి వెలుగును విద్యుత్‌గా మార్చుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. సామాన్యుల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ కనిపించాలన్నది సూర్యఘర్ పథకం ఉద్దేశం. కానీ ఆ లక్ష్యానికి బ్యాంకుల రుణ నిబంధనలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. సబ్సిడీ వస్తుందన్న ధీమాతో బ్యాంకుల మెట్లు ఎక్కుతున్న వినియోగదారులకు అక్కడే అసలు పరీక్ష ఎదురవుతోంది. సోలార్ యూనిట్ ఏర్పాటుకు లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత క్షేత్ర పరిశీలకుడు అర్జీదారు ఇంటికి వెళ్లి సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలి. సోలార్ ప్యానల్ ఏర్పాటులో ప్రభుత్వ సబ్సిడీ పొందేందుకు లబ్ధిదారుడు తన వాటాను చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం బ్యాంకుల నుండి రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది.

బ్యాంకుల కొర్రీలు.. కష్టమర్ల కన్నీళ్లు.. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు రుణం కోసం వెళ్లిన సామాన్యులకు బ్యాంకులు చుక్కలు చూపిస్తున్నాయి. సోలార్ యూనిట్ ఏర్పాటుకు లబ్ధిదారుడి వాటా కోసం రుణం అడిగితే.. సిబిల్ స్కోర్ తక్కువగా ఉందంటూ లోన్ ఇవ్వడానికి నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నాయి. మరికొందరికి సిబిల్ స్కోర్ బాగున్నా.. క్షేత్రస్థాయి పరిశీలన, ఇతర ప్రక్రియల పేరుతో నెలల తరబడి తిప్పుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా.. సిబిల్ స్కోర్ పేరుతో బ్యాంకులు దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్న ఆసక్తి ఉన్నా.. ఆర్థిక స్తోమత లేని వారు మధ్యలోనే ఆగిపోతున్నారు. బ్యాంకుల చుట్టూ తిరగలేక, అధికారుల తాత్సారాన్ని భరించలేక పలువురు వినియోగ దారులు ఈ పథకమే మాకొద్దంటూ వెనక్కి తగ్గుతున్నారు.

మరోవైపు.. అధికారుల వివరణ.. సోలార్ యూనిట్ల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే బ్యాంకులు రుణం ఇవ్వకపోవచ్చని, అయితే అర్హత ఉన్నప్పటికీ బ్యాంకు సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత ఫిర్యాదు చేయాలని రెడ్కో అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణానికి మేలు చేస్తూ, సామాన్యుడికి కరెంట్ బిల్లుల భారం తగ్గించాలనే పీఎం సూర్య ఘర్ పథకం ఆశయం బాగున్నా.. క్షేత్రస్థాయిలో బ్యాంకుల కొర్రీల వల్ల ఈ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రభుత్వం స్పందించి సోలార్ రుణాల ప్రక్రియను సులభతరం చేయకపోతే.. ఎన్నినో ఎండలకు తోడు బ్యాంకుల తిరస్కరణలతో సామాన్య వినియోగదారుడు మరింత మాడిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రజాతీర్పును అపహాస్యం చేయడం జగన్‌కు
అలవాటుగా మారింది: పల్లా

అమరావతి: పట్టణం నుంచి పల్లె వరకు కూటమి సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కూటమి ఘన విజయానికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా ఎన్ని విధ్వంసాలు సృష్టించినా ప్రజలు కూటమి పార్టీలకే జై కొట్టారని, ఈ విజయం కేవలం ఎన్నికల్లో గెలుపు మాత్రమే కాదని.. కూటమి పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఎన్నికల విధానంపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలు 2.60 కోట్ల మంది ఓటర్లను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. జగన్ ఎన్ని అబద్ధాలు చెప్పినా, విధ్వంసాలకు పాల్పడినా ప్రజలు అభివృద్ధి వైపే మొగ్గు చూపారని స్పష్టం చేశారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ బాక్సులైనా ప్రజల మద్దతు కూటమికే ఉందని, ప్రజాతీర్పును అపహాస్యం చేయడం జగన్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. చొక్కా మడత పెడతామంటే భయపడే పరిస్థితుల్లో ప్రజలు లేరని జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ విజయం పాలనపై తమ బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో 2029 ఎన్నికల్లోనూ కూటమి విజయం సాధించడం ఖాయమని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

మర్రిపాడులో టీడీపీ జైత్రయాత్ర...!

13లో 11 ఎంపీటీసీ స్థానాలు కైవసం!

జడ్పీటీసీ స్థానంలోనూ గంగినేని ప్రసన్న విజయం..

734 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థిపై గెలుపు

మర్రిపాడు నవంబరు7, అమరావతి వెలుగు : మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వెలువడ్డాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి





అభ్యర్థులు మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని తమ ఆధిక్యాన్ని చాటుకున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి నాయకత్వంలో కూటమి అభ్యర్థులు విజయాలు సాధించారు. మండలంలోని మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏడు స్థానాలు టీడీపీ ఏకగ్రీవం చేసుకుంది. ప్రత్యక్షంగా ఎన్నికలు జరిగిన ఆరు స్థానాల్లో నాలుగు చోట్ల టీడీపీ అభ్యర్థులు, రెండు చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో ఏకగ్రీవ స్థానాలతో కలిపి టీడీపీ మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలను దక్కించుకుంది.

జడ్పీటీసీగా గంగినేని ప్రసన్న విజయం... మర్రిపాడు జడ్పీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి గంగినేని ప్రసన్న 734 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సిద్ధం రెడ్డి వెంకటరమణమ్మపై ఆమె విజయం సాధించడం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మేకపాటి కుటుంబానికి స్వగ్రామమైన మర్రిపాడు మండలంలో టీడీపీ జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎంపీటీసీ విజేతల వివరాలు....

టీడీపీ అభ్యర్థులు:

పి.ఎన్.పల్లి – పి. మల్లికార్జున రెడ్డి (210 ఓట్ల మెజారిటీ)
చిన్న మాచనూరు – ఒంగోలు వెంకట సుబ్బారెడ్డి (95 ఓట్లు)
డీసీపల్లి – రాచాల పెంచలమ్మ (477 ఓట్లు)
బ్రాహ్మణపల్లి – దబ్బుగొట్టు సుమతి (189 ఓట్లు)

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు:

ఇర్లపాడు – దుగ్గిరెడ్డి మమత (226 ఓట్లు)
చుంచులూరు – చీలపోగు శివయ్య (531 ఓట్లు)

మంత్రి ఆనం వ్యూహం.. నాయకుల సమష్టి కృషి... ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందించిన దిశానిర్దేశం, మండల నాయకుల సమన్వయం కీలకంగా నిలిచాయని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. గ్రామస్థాయి నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయడంతో మెజారిటీ స్థానాలు కూటమి ఖాతాలో చేరాయని వెల్లడించాయి.

సంక్షేమ పథకాలపై ప్రజల మద్దతు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రస్తావించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం వంటి పథకాలు ప్రచారంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి.జడ్పీటీసీతో పాటు 13 ఎంపీటీసీ స్థానాల్లో 11 స్థానాలను కైవసం చేసుకోవడంతో మర్రిపాడు మండలంలో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. విజయం సాధించిన అభ్యర్థులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

మేకపాటి స్వగ్రామంలో...

పసుపు జెండా రెపరెపలు!

బ్రాహ్మణపల్లిలో వైసీపీకి బిగ్ షాక్.. టీడీపీ ఘన విజయం

189 ఓట్ల మెజారిటీతో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి దబ్బుకొట్టు సుమతి విజయకేతనం

మర్రిపాడు, నవంబరు 7, అమరావతి వెలుగు : మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ ఎంపీటీసీ సెగ్మెంట్ ఎన్నికల ఫలితం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిల స్వగ్రామంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా నిలిచింది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి దబ్బుకొట్టు సుమతి 189 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. మేకపాటి కుటుంబానికి రాజకీయంగా పట్టున్న స్వగ్రామంలోనే టీడీపీ అభ్యర్థి విజయభేరి మోగించడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది.ఈ విజయంతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సాహంతో సంబరాలు జరుపుకుంటున్నారు. మేకపాటి కుటుంబానికి కంచుకోటగా భావించే ప్రాంతంలో టీడీపీ జెండా ఎగరడం మర్రిపాడు మండల రాజకీయాల్లో కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



81వ డివిజన్ ప్రజలకు ధన్యవాదాలు

టిఎన్‌టియూసి పరుచూరి ప్రసాద్

విజయవాడ, నవంబరు 07, అమరావతి వెలుగు : ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు, 81వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పందిరి వాసు సతీమణి పందిరి నాగమణి ని అత్యధిక మెజారిటీతో కార్పొరేటర్ గా గెలిపించినందుకు డివిజన్ కమిటీ, పార్టీ సభ్యులతో కలిసి గడప గడపకి వెళ్లి 81వ డివిజన్ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా టి ఎన్ టి యూ సి రాష్ట్ర ఉపాధ్యక్షులు, 81వ డివిజన్ పరిశీలకులు పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ, "81వ డివిజన్ ప్రజలు మాపై పెట్టిన నమ్మకాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటాం. మీకు ఏ అవసరం వచ్చినా పిలిస్తేపలికే నాయకులుగా బొండా.ఉమామహేశ్వరరావు, పందిరి వాసు, కార్పొరేటర్ నాగమణి, డివిజన్ అధ్యక్షులు ఆకుల సూర్యప్రకాష్ జలకం రాజా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు"అని తెలిపారు.డివిజన్ అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



విద్యుత్ మౌలిక వసతులతో అనంతపురం, కడప జిల్లాలకు అభివృద్ధి బాట!

ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుత్ టవర్ల నిర్మాణంతో బలోపేతమవుతున్న ప్రసార వ్యవస్థ...రైతుల సహకారంతో భవిష్యత్ అవసరాలకు సన్నద్ధత

అనంతపురం / వైఎస్ఆర్ కడప నవంబరు7, అమరావతి వెలుగు : అభివృద్ధికి విద్యుత్‌మే కీలకమనే నేపథ్యంలో అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత పెరుగుతోంది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుత్ టవర్ల నిర్మాణం ద్వారా ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టులు భవిష్యత్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి దోహదపడనున్నాయి.విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో ట్రాన్స్‌మిషన్ లైన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రసార సామర్థ్యాన్ని పెంచడం, సరఫరాలో స్థిరత్వాన్ని మెరుగుపరచడం, భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి.

రైతుల సహకారానికి ప్రాధాన్యత.. పరిహారానికి నిబంధనలు... విద్యుత్ టవర్ల నిర్మాణంలో రైతుల భూములు వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో వారి సహకారం కీలకంగా మారుతోంది. టవర్ ఫౌండేషన్ నిర్మాణం, పంట నష్టాలు, ట్రాన్స్‌మిషన్ లైన్ కారిడార్‌కు సంబంధించిన పరిహారాన్ని అమల్లో ఉన్న ప్రభుత్వ మార్గదర్శకాలు,



నిబంధనలు, ఒప్పందాల ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా పరిహార ప్రక్రియ పారదర్శకంగా ఉండటం అవసరమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.టవర్ల నిర్మాణం పూర్తయిన అనంతరం భద్రతా నిబంధనలకు లోబడి వాటి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో రైతులు తమ వ్యవసాయాన్ని కొనసాగిస్తూనే విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించే పరిస్థితి ఏర్పడుతుంది.

స్థానికంగా ఉపాధి అవకాశాలు.. ప్రాంతీయంగా అభివృద్ధి... విద్యుత్ లైన్లు, టవర్ల నిర్మాణ పనులతో నిర్మాణ రంగం, రవాణా, సామగ్రి సరఫరా, స్థానిక సేవల రంగాల్లోనూ పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. విద్యుత్ ప్రసార సామర్థ్యం పెరగడం ద్వారా పరిశ్రమల స్థాపనకు, వ్యవసాయ అవసరాలకు, వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు మెరుగైన మద్దతు లభించనుంది.మొత్తంగా అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ ప్రాంతీయ అభివృద్ధికి కీలక అడుగుగా నిలవనుంది. రైతుల హక్కులు, తగిన పరిహారం, భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ పనులు ముందుకు సాగితే విద్యుత్ రంగ బలోపేతంతో పాటు గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోగతికి కూడా మరింత ఊతం లభించనుంది.

దేవీపట్నంలో కూటమి విజయదుందుభి!

జెడ్పీటీసీతో పాటు ఐదు ఎంపీటీసీ స్థానాల్లో ఘన విజయం

దేవీపట్నం, నవంబరు 7, అమరావతి వెలుగు : మండలంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విజయకేతనం ఎగురవేసింది. జెడ్పీటీసీ స్థానంతో పాటు ఐదు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుని మండలంలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.కూటమి బలపరిచిన జనసేన జెడ్పీటీసీ అభ్యర్థి చారపు వెంకటరాయుడు భారీ మెజార్టీతో విజయం సాధించి జెడ్పీటీసీ స్థానాన్ని దక్కించుకున్నారు.

ఎంపీటీసీ స్థానాల్లో విజేతలు:

తెలుగుదేశం పార్టీ:
- పాముగండి: కోసు పాపనమ్మ
- కొటకరాయి: సదల శ్రీనివాస్ రెడ్డి
- పోతవరం: తుర్రం లక్ష్మీప్రసన్న

జనసేన పార్టీ:
- ఇందుకూరుపేట: కోటం పోసియ్య దొర
- చిన్న రమణయ్యపేట: తాతి రాజేష్



కూటమి అభ్యర్థుల విజయంతో దేవీపట్నం మండలంలో పండగ వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ స్థానిక అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని విజేతలు ఈ సందర్భంగా తెలిపారు.

గండిక్షేత్రంలో భక్తులకు, యాచకులకు

అల్పాహారం పంపిణీ

ఘనంగా బండపల్లి పుల్లారెడ్డి వర్ధంతి వేడుకలు

వేంపల్లె, నవంబరు 7, అమరావతి వెలుగు : రాయలసీమ లోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిక్షేత్రంలో భక్తులకు, యాచకులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం బండపల్లి పుల్లారెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గండి క్షేత్రానికి చేరుకుని ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గండి క్షేత్రానికి విచ్చేసిన యాచకులకు, భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. దివంగత బండపల్లి పుల్లారెడ్డి ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన వర్ధంతి సందర్భంగా పేదలకు, భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దివంగతుల జ్ఞాపకాలను చిరస్మరణీయంగా నిలుపుకోవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుమారుడు బండపల్లి శివకేశవరెడ్డి, మనవరాలు బండపల్లి రితిక రెడ్డి, స్నేహితులు ఉత్తమారెడ్డి, ఓబుల్ రెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



హొళగుంద ఎంపీటీసీ-2...

టిడిపి అభ్యర్థి గెలుపుపై సంబరాలు

హొళగుంద, నవంబరు 7, అమరావతి వెలుగు : మండల కేంద్రంలోని ఎంపీటీసీ 2 టిడిపి అభ్యర్థి అబ్దుల్ సుభాన్ గెలుపు పై స్థానిక బస్టాండులో కార్యకర్తలు అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. టిడిపి తరపున పోటీ జరిపిన బడేఖర్ అబ్దుల్ సుభాన్ మరియు ఎస్ డి పి ఐ పార్టీ తరపున పోటీ చేసిన కొలిమి సలాం ఇద్దరి మధ్య పోటా పోటీగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. చివరకు హోరాహోరీగా జరిగిన ఓట్ల



లెక్కింపు ప్రక్రియలో 286 ఓట్ల ఆధిక్యంతో టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి అబ్దుల్ సుభాన్ గెలుపొందారు. దీంతో సాయంత్రం టిడిపి నాయకులు అబ్దుల్ సుభాన్ అభిమానులు కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున గ్రామ పురవీదుల గుండా మేళ తాళాలతో ర్యాలీగావించి, స్థానిక బస్టాండులో భారీ కేకును కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు తినిపించారు. మండలంలో మొత్తం మీద టిడిపి అభ్యర్థులు ఎంపీటీసీలుగా పోటీ లో గెలుపొందటం పట్ల వారంతా ఆలూరు టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతికి అభినందనలు తెలిపారు. గెలుపొందిన ఎంపీటీసీ అభ్యర్థి అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి పథకాలు మరియు ఇన్చార్జి మండలానికి ఇచ్చిన హామీ తమను గెలిపించిందని ఇందుకు తాము పార్టీలో ఓ సైనికుడిగా పనిచేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు అబ్దుల్ సుభాన్ అభిమానులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో వైసీపీ ఆధిక్యం..

6 స్థానాలు కైవసం

టీడీపీకి 5, స్వతంత్ర అభ్యర్థికి ఒక స్థానం.. వెలువడిన ఎంపీటీసీ ఫలితాలు

పాములపాడు, నవంబరు 07, అమరావతి వెలుగు : మండలంలో ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మండలంలోని మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 5న ఎన్నికలు నిర్వహించగా ఆరు స్థానాల్లో వైఎస్సార్ సీపీ, ఐదు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించాయి. మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ తరపున



పాములపాడులో పరమేశ్వరి 456 ఓట్ల మెజారిటీతో మిట్టకందాలలో యుగంధర్‌రెడ్డి 72 ఓట్లతో, మద్దూరులో తలకంటి దేవి 115 ఓట్లతో, జూటూరు-2లో పుల్లయ్య 350 ఓట్లతో, ఎర్రగుడూరులో భారతి 450 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రుద్రవరం స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ తరపున జూటూరు-1లో టేకూరి రామసుబ్బమ్మ 100 ఓట్ల మెజారిటీతో, వేంపెంటలో లక్ష్మీబాయ్ 150 ఓట్లతో, ఇస్కాలలో ముబీనా 146 ఓట్లతో, చెలిమిళ్లలో శ్యామలమ్మ 60 ఓట్లతో, భానుముక్కలలో మూల నరేష్ 255 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.వాడాల గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మొత్తంగా ఆరు స్థానాలతో వైఎస్సార్‌సీపీ ముందంజలో నిలవగా, ఐదు స్థానాలతో టీడీపీ రెండో స్థానంలో నిలిచింది.

మహిళా ఐక్య వేదిక బలోపేతానికి సమష్టి కృషి చేయాలి

సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలి

కర్నూలు, నవంబరు 7, అమరావతి వెలుగు : నగరంలోని బి. క్యాంపులో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సావిత్రిబాయి పూలే జయంతి జనవరి 3 నుంచి ఫాతిమా షేక్ జయంతి జనవరి 9 వరకు జరిగే జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే బహుజన వనభోజనాల నిర్వహణపై సభ్యులతో చర్చించి, రాబోయే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. సంఘంలోని సభ్యులందరూ క్రమశిక్షణతో, ఐక్యతతో సంస్థ విధివిధానాలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. మహిళా ఐక్య వేదిక లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఈరమ్మ, హుస్సేన్ బీ, ఆకుతోట పద్మావతి, ఖాసింబీ, షేకున్ బీ, రేవతి, రంగమ్మ, అమీనాబీ, మాసుంబీ, కళావతి, మరియమ్మ, కన్యాకుమారి, చిరంజీవమ్మ, రమాదేవి, పద్మావతి, రామాంజినమ్మ, రూతమ్మ, కె. సుజాత, లక్ష్మీదేవి, మాదాసు సుజాత, బోయ భాగ్యమ్మ, లక్ష్మీ ఎరుకల, నాగమ్మ ఎరుకల, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.



కార్తీకమాసానికి శ్రీశైలంలో భారీ ఏర్పాట్లు

నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు ఉత్సవాలు.. 16 రోజులు పర్వదినాలుగా ప్రకటన

భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు -ఈఓ ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం (దేవస్థానం), నవంబరు 07, అమరావతి వెలుగు : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో కార్తీకమాస ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ ఎం. శ్రీనివాసరావు తెలిపారు.



16 రోజులు పర్వదినాలుగా గుర్తింపు... కార్తీకమాసంలో నవంబర్ 14, 15, 16, 20, 21, 22, 23, 24, 28, 29, 30 తేదీలతో పాటు డిసెంబర్ 4, 5, 6, 7, 8 తేదీలను పర్వదినాలుగా ప్రకటించారు. ఈ రోజుల్లో అదనపు భద్రత, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు... కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 16, 23, 24, 30, డిసెంబర్ 7 తేదీల్లో పుష్కరిణి వద్ద లక్ష దీపారాధన, హారతి నిర్వహించనున్నారు. నవంబర్ 20న కోటి దీపోత్సవం, నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహిస్తారు. నవంబర్ 13న సాయంత్రం 6 గంటలకు పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు పుణ్య నదీ హారతి ఇవ్వనున్నారు.

పంచమఠాల్లో రూ.216కే అభిషేకం... నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రతిరోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పంచమఠాల్లో రూ.216 రుసుముతో అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయంలో ఓం నమఃశివాయ భజన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. భజన మండళ్లకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నారు.

భక్తులకు అదనపు సదుపాయాలు... భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్ల సంఖ్యను 14కు పెంచుతున్నారు. ఇందులో మహిళలకు రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు పాలు, అల్పాహారం అందించనున్నారు. పాతాళగంగ వద్ద గజ ఈతగాళ్లు, ప్రాథమిక చికిత్సా కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.ముఖ్య పర్వదినాల్లో ఆన్‌లైన్ గదులు, కాటేజీల రిజర్వేషన్లను నిలిపివేయనున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులతో సమన్వయం చేయడంతో పాటు వసతి విభాగంలో అదనంగా 25 మంది తాత్కాలిక సిబ్బందిని నియమించనున్నారు. కార్తీకమాసంలో భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ దేవస్థాన సిబ్బంది, పోలీసులకు సహకరించాలని ఈఓ ఎం. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

లింగాలలో టీడీపీ జెండా ఎగురవేసిన
యమ్మనూరు సరళాదేవి

1,568 ఓట్ల భారీ ఆధిక్యంతో జెడ్పీటీసీ విజయం.. టీడీపీ శ్రేణుల్లో సంబరాలు

లింగాల, నవంబరు7, అమరావతి వెలుగు : మండల జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థులపై 1,568 ఓట్ల భారీ ఆధిక్యాన్ని సాధించి విజయకేతనం ఎగురవేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంచుకోటగా పేరొందిన లింగాల మండలంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఫలితాలు వెలువడగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ సరళాదేవికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీటెక్ రవితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందించిన మద్దతుతోనే ఈ విజయం సాధ్యమైందని, తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తానని ఆమె తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.



రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన
ఆచార్య ఎన్జీ రంగా

జయంతి వేడుకల్లో ఘన నివాళులర్పించిన కిసాన్ కాంగ్రెస్ నాయకులు

కర్నూలు, నవంబరు 7, అమరావతి వెలుగు : స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నాయకుడు ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకలను కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఏ. సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. రైతుల సమస్యలను పార్లమెంటులో బలంగా వినిపిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధరలు, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువత ఎన్జీ రంగా ఆశయాలను ఆదర్శంగా తీసుకొని రైతుల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆశయ సాధనకు కిసాన్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్.సి. బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ ముషీద్ పిర్ ఖాద్రి, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈ. లాజరస్, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్, యు. శేషయ్య, వార్డు ఇన్‌చార్జి షబ్బీర్, నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొని ఆచార్య ఎన్జీ రంగాకు ఘనంగా నివాళులర్పించారు.



మురసు తుఫాన్ బాధిత రైతులకు...
తక్షణ పరిహారం అందించాలి

పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేపట్టాలి...లోతట్టు ప్రాంతాల బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు7, అమరావతి వెలుగు : మురసు తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరదలతో లోతట్టు కాలనీలు జలమయమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలల తరబడి కష్టపడి సాగుచేసిన పంటలు వరద నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా రైతులు పెట్టుబడులు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.పంట నష్టాన్ని కేవలం అధికారిక లెక్కలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని కోరారు. ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.మరోవైపు వరదల కారణంగా లోతట్టు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు దెబ్బతిన్నాయని తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం చెల్లించాలని కోరారు. పునరావాసం, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో హామీలు ఇవ్వడమే కాకుండా బాధితుల నష్టాలను సమగ్రంగా అంచనా వేసి తగిన పరిహారం అందించినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని రవిచంద్ర పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నష్టపోయిన రైతులు, వరద బాధిత కుటుంబాలకు రాజకీయాలు, వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వేముల జడ్పీ పీఠం.. వైసీపీ ఖాతాలో...

1,569 ఓట్ల ఆధిక్యంతో నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయధ్వంకా

ఓటర్ల తీర్పుతో ప్రత్యర్థులకు నిరాశ !

వేముల, నవంబరు7, అమరావతి వెలుగు : మండల పరిషత్ రాజకీయాల్లో జడ్పీటీసీ ఎన్నికల ఫలితం ఆసక్తికరంగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఎన్నికల సమరంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 1,569 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో గెలుపొందారు. దీంతో వేముల జడ్పీటీసీ స్థానం వైఎస్సార్‌సీపీ వశమైంది.



ప్రచార పర్వానికి ఓట్ల రూపంలో సమాధానం!... ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. గ్రామగ్రామాన ప్రచారాలు, నాయకుల పర్యటనలు, కార్యకర్తల ముమ్మర ప్రయత్నాలతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. చివరకు ఓట్ల లెక్కింపులో నాగేళ్ల సత్యప్రభావతమ్మ ఆధిక్యం స్పష్టమైంది. 1,569 ఓట్ల మెజారిటీతో విజయాన్ని నమోదు చేశారు.

ఫలితంతో శ్రేణుల్లో సందడి !.. విజయం ఖరారు కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ ఫలితం వేముల మండల రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటర్లు ఇచ్చిన తీర్పుతో జడ్పీటీసీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ మరోసారి తన ఖాతాలో వేసుకుంది.

19203 ఓట్ల భారీ మెజారిటీతో...
వైకాపా జడ్పీటీసి బత్తల శివమ్మ ఘన విజయం

పండ్లు పంపిణీ చేసిన వైసీపీ అభిమానులు

వేంపల్లి నవంబరు7, అమరావతి వెలుగు వేంపల్లి జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తల శివమ్మ ఘన విజయం సాధించడం పట్ల వైసీపీ అభిమానులు పెద్ద ఎత్తున



హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవిపై 19, 203 ఓట్ల భారీ మెజార్టీతో బత్తల శివమ్మ గెలుపొందారు. దీంతో వేంపల్లి జడ్పీటీసీ స్థానం వైసీపీ ఖాతాలో చేరింది. దీంతో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజలకు పెద్ద ఎత్తున పండ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ వైకాపా జడ్పీటీసి బత్తల శివమ్మకు ప్రజలు భారీ మెజార్టీతో విజయాన్ని అందించడం వైసీపీపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రజల ఆదరణ, అభిమానమే ఈ ఘన విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

వేంపల్లి జడ్పీటీసీ స్థానాన్ని...
కైవసం చేసుకున్న వైసీపీ

19,203 ఓట్ల భారీ మెజారిటీతో బత్తల శివమ్మ ఘన విజయం

వేంపల్లె, నవంబరు 7, అమరావతి వెలుగు : జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తల శివమ్మ ఘన విజయం సాధించారు. వేంపల్లి జడ్పీటీసీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవిపై 19,203 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. దీంతో జడ్పీటీసీ స్థానం వైసీపీ ఖాతాలో చేరింది. ఓట్ల లెక్కింపులో బత్తల శివమ్మకు 23,005 ఓట్లు రాగా, జనసేన అభ్యర్థి బెస్త లక్ష్మీదేవికి 3,802 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థి మున్నీకి 67 ఓట్లు, మరో స్వతంత్ర అభ్యర్థి హజిరూన్‌కు 188 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 328 ఓట్లు రాగా, 726 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. భారీ మెజారిటీతో బత్తల శివమ్మ విజయం సాధించడంతో వైసీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



గోరంట్ల 1వ ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి
కక్కల రఘునాథ్ రెడ్డి విజయం

గోరంట్ల, నవంబరు 7, అమరావతి వెలుగు : మండలంలోని గోరంట్ల 1వ ఎంపీటీసీ స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కక్కల రఘునాథ్ రెడ్డి ఘన విజయం సాధించారు. తన సమీప



ప్రత్యర్థులపై 456 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంత్రి సవితమ్మ ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల బరిలో నిలిచిన కక్కల రఘునాథ్ రెడ్డి ఓటర్ల మద్దతు కూడగట్టుకుని విజయాన్ని అందుకున్నారు. ఈ స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కురుబ సత్యనారాయణ, జనసేన పార్టీ అభ్యర్థి పాగుతోట వెంకటేష్ పోటీ చేశారు.ఓట్ల లెక్కింపు అనంతరం వెలువడిన ఫలితాల్లో కక్కల రఘునాథ్ రెడ్డి 456 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. ఫలితాలు వెలువడిన వెంటనే టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ వార్డ్ మెంబర్ నాగరాజు, మాజీ కన్వీనర్ పుల్లేరు సుబ్రహ్మణ్యం, హంపయ్య,గుంటుపల్లి చంద్రశేఖర, కర్ణ సోమశేఖర్, తదితరులు రఘునాథ్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

తాళ్లకేర-1 ఎంపీటీసీగా సత్యనారాయణరెడ్డి ఘన విజయం!

341 ఓట్ల మెజారిటీతో విజయధ్వంకా.. టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను...గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా - నూతన ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి

రాయదుర్గం, నవంబరు 07, అమరావతి వెలుగు : గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకేర-1 ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సత్యనారాయణరెడ్డి ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 341 ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రజల ఆదరణతో విజయాన్ని సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నూతన ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసి గెలిపించిన తాళ్లకేర-1 తాళ్లకేర గ్రామా ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు కోసం కృషి చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు అందించిన ఈ విజయాన్ని ఎంతో బాధ్యతగా స్వీకరిస్తున్నానని పేర్కొన్నారు.



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చేందుకు కృషి చేస్తానని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు.ఎంపీటీసీగా ఎన్నిక కావడం తనకు దక్కిన గౌరవంగా కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావిస్తానని, గ్రామాల అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని భరోసా ఇచ్చారు.తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాళ్లకేర గ్రామాని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని నూతన ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576